క్లుప్తంగా

## విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ



విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

**చేవెళ్ల:** ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు దాతలు అందించే సహాయ సహకారాలు మరువలేనివని కేసారం పాఠశాల హెచ్‌ఎం శశికళ అన్నారు. మండలంలోని కేసారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాగ్స్, మ్యాట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ అరుణ, జర్నలిస్ట్ రాఘవేందర్, న్యాయవాది రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల అభివృద్ధికి చర్యలు

**మొయినాబాద్‌రూరల్:** విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని అజీజ్ నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జి రజియాసుల్తానా పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాఠశాలలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పేరుతో స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు తమతమ పాఠశాలల్లో విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానంపై కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి అరుణ్‌కుమార్, మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొందుర్గు ఎంపీడీఓగా లక్ష్మిఅనురాధ



**కొందుర్గు:** కొందుర్గు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వి.లక్ష్మిఅనురాధ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆంజనేయులు జూన్ 31న పదవీ విరమణ పొందారు. అయన స్థానంలో నల్గొండ జిల్లా చండూర్‌లో పనిచేస్తున్న లక్ష్మిఅనురాధ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

## వర్గీకరణపై న్యాయమైన ముగింపు

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

**చేవెళ్ల:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా దేశంలో జరుగుతున్న పోరాటానికి సుప్రీంకోర్టు న్యాయమైన ముగింపునిచ్చిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ అన్నారు. చేవెళ్లలో సోమవారం ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 1న వర్గీకరణ అమలు జరపాలని రాష్ట్రాలకు అధికారికంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. టపాకాయలు కాల్చుకుంటూ సంబరాలు చేశారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇప్పటివరకు ఇచ్చిన నోటిఫికేషన్‌లలో వర్గీకరణను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరేశ్, హరీశ్, రాజు, పవన్, శేఖర్ ఉన్నారు.

## బీజేపీ మండల కమిటీ ఎన్నిక

**కేశంపేట:** బీజేపీ యువ మోర్చా మండల కమిటీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రొల్లు రఘురాంగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యువ మోర్చా కమిటీ అధ్యక్షుడిగా పాలాది శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కానుగుల మహేశ్, గురుప్రసాద్, శివచారి, శ్రీకాంత్, క్రాంతి, ప్రధాన కార్యదర్శులుగా సిలివేరు విఘ్నేశ్, రాకేశ్, కార్యదర్శులుగా నాగరాజు, శ్రీకాంత్, శివకుమార్, విజయరెడ్డి, శివకుమార్‌ను ఎన్నుకున్నట్లు రఘురాంగౌడ్ తెలిపారు. యువ మోర్చాను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, దేవేందర్, శివాజీ, సాయి, నర్సింహ, కుమారస్వామి, నర్సింగ్, శివ, వినోద్, రాజు, రాహుల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విచక్షణారహితంగా కొట్టడం దారుణం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య

**షాద్‌నగర్‌రూరల్:** బంగారం దొంగిలించారనే నెపంతో దళిత మహిళను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచక్షణారహితంగా కొట్టడం దారుణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. పోలీసుల దాడిలో గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దళిత మహిళ సునీతను సోమవారం బాబయ్య, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు శివ, భూషణ్ పటేల్, నర్సింహ, శివశంకర్, శ్రీకాంత్, సురేశ్, మల్లేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతతో మెరుగైన జీవనం

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, నాయకులు సోమవారం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో స్వచ్ఛత, పచ్చదనంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలు గ్రామాల్లో అధికారులు మొక్కలు నాటి, పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారులు అంగన్‌వాడీ సిబ్బంది, తహసీల్దార్లు, పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

- గ్రామాల్లో 'స్వచ్ఛదనం– పచ్చదనం' కార్యక్రమాలు
- స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలు
- అందరూ భాగస్వాములు కావాలని ప్రముఖుల పిలుపు




షాద్‌నగర్: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

**షాద్‌నగర్:** ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రజల జీవన ప్రమాణాలు మరింతగా పెంచేందుకు మొక్కల పెంపకం, పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను ఉద్యమంలా చేపట్టాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు పెంచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, సీడీపీఓ నాగమణి, విశ్వం, రమాదేవి, బాబర్‌ఖాన్, రఘునాయక్, తిరుపతిరెడ్డి, జమృద్‌ఖాన్, డంగు శ్రీను, ఇబ్రహీం, రాయికల్ శ్రీనివాస్, ముబారక్, అందె మోహన్, సింగారం సుదర్శన్, డీటీ ఆనంద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**పచ్చదనం పరిశుభ్రతతో వ్యాధులు దూరం**

**చేవెళ్ల:** పచ్చదనం పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఆర్డీఓ సాయిరాం, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మిలు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మివేంకటేశ్వరస్వామి పుష్కరిణి(గుండం) ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి వారు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులతో కలిసి స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హిమబిందు, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజ, మాజీ ఎంపీటీసీ రాములు, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, ఉపాధ్యాయులు ఉన్నారు.

**పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి**

**శంకర్‌పల్లి:** మన చుట్టూ ఉన్న పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం శంకర్‌పల్లిలో కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ఆమె స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 9వ వార్డులో స్వయం సహాయక సంఘాలు, యూత్ క్లబ్ సభ్యులు, స్థానిక నాయకులతో సమావేశం, మోడల్ స్కూల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని మోకిలలో ఎంపీడీఓ వెంకయ్య, గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటి, నీరు పోశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రావణి, టంగటూర్ పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాస్, డీపీఎం నిర్మల, ఏపీఎం భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి**

**కొత్తూరు:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీ కోరారు. సోమవారం ఆయన స్వచ్ఛదనం, పచ్చదనంపై అధికారులు, విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కొందుర్గులో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న గ్రామస్తులు



చేవెళ్లలో మొక్కలు నాటుతున్న అధికారులు ఆర్డీఓ సాయిరాం, తదితరులు



షాబాద్‌లో మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు




కొత్తూరు: ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ బాలాజీ



శంకర్‌పల్లిలో..



చిలుకూరులో..

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

**షాద్‌నగర్:** సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లేడు చౌదరిగూడ, కొందుర్గు, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 210 మంది లబ్ధిదారులకు రూ.68లక్షల 81వేల చెక్కులను అందజేశారు.



ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే

**అభివృద్ధి పనుల ప్రొసీడింగ్‌ల అందజేత**

ఫరూఖ్‌నగర్ మండలంలో జెడ్పీటీసీ నిధుల కింద మంజూరైన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రొసీడింగ్‌లను సోమవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి, ఆయా గ్రామాల నాయకులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మేళ్లగూడ తండా ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.3లక్షలు, మధురాపూర్, బూర్గుల, ఎలికట్ట గ్రామాల్లోని రైతు వేదికలో మంచినీటి సౌకర్యం కోసం రూ.6లక్షలు, అన్నారంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి రూ.10లక్షలు, ఎలికట్టలో మహిళా సంఘం భవన నిర్మాణానికి రూ.10లక్షలు, పీర్లగూడలో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.3లక్షలు, చౌలపల్లిలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.4లక్షలు మొత్తం రూ.36లక్షలు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన ప్రొసీడింగ్‌లను ఎమ్మెల్యే నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో సూర్యప్రకాశ్, శ్రీశైలం, రాఘవేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**కొందుర్గు:** మండలంలోని ముట్పూర్, విశ్వనాథ్‌పూర్ తదితర గ్రామాల్లో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి, మల్లయ్య, శ్రీను, ద్విజేందర్, అంజయ్య, రవి, నర్సింలు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

## పరామర్శ



నారాయణరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

**నందిగామ:** బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి మాతృమూర్తి తిరుమలమ్మ ఆదివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలిసిన బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం నందిగామలో నారాయణరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీలు నాగరకుంట నవీన్‌రెడ్డి, సురభివాణీ, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, స్థానిక నేతలు తదితరులు ఉన్నారు.

## ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తిచేస్తాం

**కొందుర్గు:** మండలంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయాలని ఎమ్మెల్యే ఆదేశాలను సారం తాము అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలతో పాటు, దెబ్బతిన్న రోడ్లు, వంతెనలను పరిశీలిస్తున్నామని, ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తిచేస్తామని పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం రామచంద్రాపూర్ నుంచి రేగడిచిల్కమర్రి బీటీరోడ్డు, టేకులపల్లి వంతెనతో పాటు ముట్పూర్‌లో అసంపూర్తిగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీహాల్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇట్టి పనులకు సంబంధించిన నివేదికను ఎమ్మెల్యేకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ తేజ, నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, నర్సింలు, అంజయ్య, ద్విజేందర్, శ్రీను పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

**షాద్‌నగర్‌రూరల్:** ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శ్రావణ మాసం మొదటి సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని వినాయక గంజ్‌లో ఉన్న గణపతి దేవాలయంలో మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఎమ్మెల్సీని స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు.



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న నాయకులు

కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు వెంకటేశ్ గుప్తా, భరత్, రాజేశ్, నాయకులు నంద కిషోర్, అభిలాశ్, ఎంసాని శ్రీనివాసులు, దినేశ్ సాగర్, గోపాల్, గణేశ్, నర్సింలు, శ్రీకాంత్, అర్చకులు రాజన్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## మార్మోగిన శివనామస్మరణ

**మొయినాబాద్‌రూరల్:** శివనామస్మరణతో కనకమామిడి సంగమేశ్వర దేవాలయం మార్మోగింది. శ్రావణమాసం మొదటి సోమవారం కావడంతో వేదపండితులు, ఆలయ అర్చకులు కలిసి ఉదయాన్నే గణపతి హోమం, రుద్రాభిషేకం నిర్వహించి నైవేద్యం సమర్పించి మహామంగళహారతి నిర్వహించారు. మొదటిరోజు సోమవారం కావడంతో చుట్టు పక్క గ్రామాలతో పాటు జంట నగరాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి క్యూలైన్‌లో స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులకు వేదపండితులు, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



క్యూలో దర్శనానికి వెళ్తున్న భక్తులు

## విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాయికాడి శంకర్

**చేవెళ్ల:** విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాయికాడి శంకర్ అన్నారు. మండలంలోని పలు కళాశాలల్లో సోమవారం ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్ట్రగుల్ ఫండ్ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఎఫ్ఐ చేస్తున్న పోరాటాలకు విద్యార్థులు ఆదరించి తమ సహాయ సహకారాలు అందిస్తున్న విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరున్‌కుమార్, నాయకులు తదితరులు ఉన్నారు.

# మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

సీడీపీఓ నాగమణి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ నాగమణి

**కొందుర్గు:** మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీడీపీఓ నాగమణి కోరారు. సోమవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్ వారి ఆధ్వర్యంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ నాగమణి మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరమన్నారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు ఉద్యోగం, ప్రేమ పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారని గుర్తుచేశారు. మానవ అక్రమ రవాణాపై ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు సమచారం అందించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ తమ పరిధిలోని పేదలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజ్వల సంస్థ కోర్డినేటర్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. గత 28 ఏళ్లుగా మానవ అక్రమ రవాణా నిర్మూలన, లైంగిక వ్యాపారాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ 28600 మంది అమ్మాయిలను కాపాడి పునఃరావాసం కల్పించామన్నారు. సమావేశంలో తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ, డాక్టర్ అమ్రిత జోసెఫ్, ప్రజ్వల వ్యవస్థాపకురాలు డాక్టర్ సునీత, సఖీ అధికారిణి మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లుదియా

**కొందుర్గు:** తల్లిపాలే బిడ్డకు ఎంతో శ్రేష్టమని, పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పట్టాలని కొందుర్గు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ లుదియా సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం కొందుర్గు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు. బిడ్డ ఆరునెలల వయస్సు వచ్చేవరకు ఖచ్చితంగా తల్లిపాలనే తాగించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి లాలయ్య, పంచాయతీ కార్యదర్శి బాబయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

**సంగెంలో..** కేశంపేట: మండల పరిధిలోని సంగెం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్లు సుమల్యమ్మ, శశికళలు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి తల్లులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మానవ అక్రమ రవాణా జరిగే విధానాన్ని మహిళలకు వివరించి, ఎలా రక్షించుకోవాలో నేర్పించారు. పుట్టిన బిడ్డలకు వెంటనే ముర్రుపాలను తాగించాలని గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో నాగమణి, అరుణ, శివలీల, కృష్ణవేణి, రజిత, వాణీ, జ్యోతి పాల్గొన్నారు.

# పంట బీమా అమలు చేయాలి

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

**షాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని వెంటనే అమలుచేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి రాజిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రైతువేదికలో భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణిలో వివిధ రకాల మార్పులు చేసి గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఐదు సంవత్సరాలుగా భూముల సమస్యలు పరిష్కారంకాక చాలా మంది రైతులు మానసిక బాధకు గురయ్యారన్నారు. రైతులకు ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేసినా అనేక మంది రైతులకు వివిధ కారణాలు చూపుతూ రుణమాఫీ చేయడం లేదన్నారు. రుణమాఫీ రైతులకు కేవలం అసలు మాత్రమే చెల్లించి, వడ్డీ చెల్లించకపోవడం సరికాదన్నారు. రేషన్‌కార్డు ప్రతిపాదన తొలగించి రైతులందరికీ రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘం నాయకులు రామస్వామి, మల్లయ్య, పాండు, శివకుమార్, మల్లేశ్, రాంచంద్రయ్య, రవీందర్‌రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

# చేవెళ్ల మండల ప్రత్యేకాధికారిగా విజయలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్..



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయలక్ష్మి

**చేవెళ్ల:** ఎట్టకేలకు నెలరోజుల తర్వాత చేవెళ్ల మండల ప్రత్యేకాధికారిని నియమించారు. ప్రత్యేకాధికారిగా సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ విజయలక్ష్మిని నియమించటంతో సోమవారం ఆమె బాధ్యతలు తీసుకొని చేవెళ్లలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభించి నెలరోజులు గడుస్తున్నా ప్రత్యేకాధికారి జాడలేకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుంటున్నాయని, 'ప్రత్యేకాధికారి ఎవరో?' అనే శీర్షికన జూలై 31న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో జిల్లా మేనేజర్‌గా ఉన్న సివిల్ సప్లయ్ అధికారి విజయలక్ష్మిని చేవెళ్ల మండల ప్రత్యేకాధికారిగా నియమించడంతో ఆమె సోమవారం మండల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మండలంలో ప్రారంభించిన స్వచ్ఛదనం–పచ్చద నం కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల అభివృద్ధికి సహకారం అందిస్తానని చెప్పారు.

## విరాళాల సేకరణ



నందిగామ: విరాళాలు సేకరిస్తున్న నాయకులు

**నందిగామ:** కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో వరదలకు ప్రాణాలు కోల్పోయిన బాధితుల సహాయం కోసం సీపీఐ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన నందిగామలో సోమవారం విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. మానవీయ కోణంలో ఆలోచించి ఎంతో కొంత సహాయం చేసినట్లయితే బాధితులను ఆదుకున్నవారమవుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు జిలెల్ల బాల్‌రెడ్డి, కాట్న సురేందర్, చాంద్‌పాషా, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

**చేవెళ్ల:** మానవత దృక్పథంతో కేరళ వరద బాధితులను ఆదుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సీపీఐ పార్టీ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కేరళ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అన్ని దుకాణాలకు వెళ్లి విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు ముందుకొచ్చి బాధితులకు సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఆప్తులను కల్పోయి అనాథలుగా మిగిలిన వారికి ఆసరా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి ఎం.డీ మక్బుల్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, ఆనందరం, యాదగిరి, లలిత, వెంకటమ్మ, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

# మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం సరికాదు

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

**షాద్‌నగర్:** బంగారం దొంగతం చేసిందనే నెపంతో దళిత మహిళ సునీతపై షాద్‌నగర్ పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం సరికాదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. దళిత మహిళను విచక్షణారహితంగా కొట్టిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఎదుట కేవీపీఎస్, గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ తదితర సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. షాద్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీతను సోమవారం స్కైలాబ్‌బాబుతో పాటు పలువురు నాయకులు పరామర్శించారు. మహిళను కొట్టిన పోలీసులను సస్పెండ్ చేసి వారిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బోడ సామెల్, ప్రకాశ్, లక్ష్మీదేవి, ఎస్.రాజు, శ్రీనునాయక్, ఈశ్వర్‌నాయక్, శ్రీకాంత్, వడ్ల చంద్రమౌళి, కావలి రాజు, రాజశేఖర్, శ్రీనివాస్, లక్ష్మి, నర్సింలు పాల్గొన్నారు.